సాక్షి పార్వతీపురం మన్యం

శుక్రవారం । 5 । జూలై । 2024



నిరాశలో 'ఆణిముత్యాలు'

ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుని ప్రతిభ చూపే విద్యార్థులపై ప్రభుత్వం శీతకన్నువేసింది. 'ఆణిముత్యాలకు' ప్రోత్సాహం కరువైంది. - 8లో



జీఎంఆర్ ఐటీ వేదికగా అంతర్జాతీయ సదస్సు - 8లో

రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఐటీ కళాశాల వేదిక కానుంది.



ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి - 8లో

జీఓ నంబర్ 117ను రద్దు చేసి విద్యార్థుల అభ్యసన స్థాయికి అనుగుణంగా బోధన సాగించాలని ఉపాధ్యాయులు కోరారు.

న్యూస్‌రీల్

ఐటీడీఏ ఏపీఓగా చినబాబు



సీతంపేట: ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ (ఏపీఓ)గా జి.చినబాబు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన ఐటీడీఏ సిబ్బందితో సమావేశమయ్యారు. గిరిజనాభివృద్ధి పథకాలు పకడ్బందీగా అమలు చేయడానికి, ఐటీడీఏను ప్రగతి పథంలో నడిపించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడు రాజీనామా



డాక్టర్ రంగముద్రి శివ నరేంద్రనాయుడు

పార్వతీపురంటౌన్: పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ యువజన అధ్యక్షుడు డాక్టర్ రంగముద్రి శివ నరేంద్ర నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామాను వైఎస్సార్‌సీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డికి గురువారం పంపించారు. పార్వతీపురం మన్యం జిల్లాలో పార్టీ పటిష్టత కోసం కీలకభూమిక పోషించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓడిపోవడంతో బాధ్యతగా తన పదవికి రాజీనామా చేసినట్టు తెలిపారు. వైఎస్సార్‌సీపీలో ఉంటూ పార్టీకి సేవ చేస్తానని చెప్పారు.

బాసంగి గదబవలసలో ఏనుగుల గుంపు



బాసంగి గదబవలస సమీపంలో సంచరిస్తున్న ఏనుగులు

జియ్యమ్మవలస: మండలంలోని బాసంగి గదబవలస పంట పొలాల్లో ఏనుగుల గుంపు గురువారం దర్శనమిచ్చాయి. అరటి, పామాయిల్ తోటలతో పాటు వరి నారుమడుల్లో సంచరిస్తుండడంతో రైతులు భయాందోళన చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు స్పందించి వాటిని తరలించే చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

నాక్‌లో స్కిల్‌హబ్

విజయనగరం రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ–నాక్) ఆధ్వర్యంలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, జిల్లా కేంద్రంలోని వీటీ అగ్రహారంలోని నాక్ శిక్షణ కేంద్రంలో స్కిల్‌హబ్స్ ఏర్పాటు చేశామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తెలిపారు. స్కిల్ హబ్‌లలో ఈ నెల 9వ తేదీ నుంచి 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయస్సు ఉండి, కనీసం 8వ తరగతి అర్హత కలిగిన నిరుద్యోగ యువకులకు వివిధ కోర్సుల్లో శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలకు సెల్: 81210 16785, 93982 86654 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో రుద్రాభిషేకం



శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహిస్తున్న రుత్వికులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాపల్లి గేటు సమీపంలోని ఓం సదనం ఆశ్రమంలో జ్యేష్ఠ మహాశివరాత్రిని పురస్కరించుకుని గురువారం 108 శివలింగాలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం జరిపారు. బ్రహ్మశ్రీ ఉమామహేశ్వరశర్మ, కిరణ్‌కుమార్‌శర్మ, జగన్నాథశర్మల మంత్రోచ్ఛరణాల నడుమ అభిషేకం సాగింది. అధిక మంది భక్తులు పాల్గొని శివలింగాలకు పూజలు చేశారు.

7న జిల్లా స్థాయి చెస్ పోటీలు

విజయనగరం: చెస్ అసోసియేషన్ ఆఫ్ విజయనగరం ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ కార్యదర్శి కె.వి.జ్వాలాముఖి గురువారం తెలిపారు. రింగ్‌రోడ్‌లోని ఫైర్‌చెస్ స్కూల్‌లో నిర్వహించే పోటీల్లో అండర్–7,9,11,13 వయస్సుల విభాగాల క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు విధిగా జనన ధ్రువీకరణ పత్రం వెంట తీసుకురావాలని సూచించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేస్తామన్నారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు సెల్: 74166 66567 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వందనమన్నావ్.. ఏమైపోయావ్ చంద్రన్నా!



పార్వతీపురానికి చెందిన రాజేష్ ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు పిల్లలుండగా.. వారి భవిష్యత్తు బాగుంటుందని పిల్లలను పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదివిస్తున్నాడు. గత ఏడాది వరకు ఒకే పిల్లవానికి సంబంధించి రూ.15 వేలు అమ్మ ఒడి పథకం కింద నగదు విద్యాసంవత్సరం ప్రారంభంలోనే అందేది. దీంతో పిల్లల మొదటి విడత ఫీజులు గట్టెక్కుపోతుండేవి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో 'తల్లికి వందనం' పథకం కింద ఇద్దరి పిల్లలకూ రూ.15 వేలు చొప్పున జమవుతుందని చెప్పడంతో ఆనందపడ్డాడు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా పథకం ఊసు లేదు. దీంతో ఫీజులు, పుస్తకాల కోసం అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నాడు.

- 'తల్లికి వందనం'పై నేటికీ స్పష్టత కరవు
- విద్యాసంవత్సరం ఆరంభమై నెల రోజులు
- ఫీజుల కోసం అప్పులు చేస్తున్న తల్లిదండ్రులు
- కుటుంబంలో చదువుకున్న పిల్లలందరికీ రూ.15 వేలు చొప్పున ఇస్తామన్న చంద్రబాబు
- ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేకుపోవడంతో ఆందోళన

సాక్షి, పార్వతీపురం మన్యం:

ఏ ఒక్క విద్యార్థీ పేదరికం కారణంగా చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 'అమ్మ ఒడి' పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేసింది. పిల్లలను బడికి పంపే ప్రతి తల్లి ఖాతాకూ నేరుగా రూ.15 వేలు చొప్పున విద్యాసంవత్సరం ఆరంభంలోనే జమ చేసింది. ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలన్న తారతమ్యం లేకుండా.. ఒక కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే వర్తింపజేసింది. పాఠశాలల పునఃప్రారంభం రోజునే విద్యాకానుకలను సైతం అందించేది. దీనివల్ల జిల్లాలో వేలాది మంది లబ్ధి పొందారు. గత ఎన్నికలకు ముందు చంద్రబాబు నేతృత్వంలోని కూటమి పార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోలో 'అమ్మ ఒడి' పేరును 'తల్లికి వందనం'గా మార్పు చేసి ఒక కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే.. అందరికీ రూ.15 వేలు చొప్పున జమ చేస్తామని ప్రకటించారు. విద్యాసంవత్సరం ప్రారంభమైనా ఇప్పటికీ దీనిపై విధివిధానాలు లేవు. గత ప్రభుత్వ హయాంలో తొలి రెండేళ్లు ఏటా జనవరిలో ఈ పథకం ద్వారా తల్లుల ఖాతాల్లో నగదు చేసేవారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచాలనే నిబంధన పెట్టి, మరో రెండేళ్లు పాఠశాలలు తెరిచిన తర్వాత జమ చేస్తూ వచ్చారు. గత విద్యాసంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది జూన్‌లో అమ్మ ఒడి నగదు చేయాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో ఈ పథకానికి సంబంధించిన నిధుల జమపై స్పష్టత కరవైంది.

గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పథకం కింద విద్యార్థులకు కలిగిన లబ్ధి ఇలా..		
విద్యా సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
2019–20	83,821	125.73
2020–21	74,890	112.33
2021–22	86,409	129.61
2022–23	97,761	146.64

నాడు క్రమం తప్పకుండా జమ

గత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అమ్మ ఒడి పథకాన్ని 2020 జనవరి 9వ తేదీన ప్రారంభించారు. అదే ఏడాది కరోనా రావడంతో మునుపటి ఏడాదిలోని పిల్లలందరినీ అర్హులుగా నిర్ణయించి, 2021 జనవరి 9న రెండో ఏడాది కూడా పథకం నిధులను జమ చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతాన్ని, విద్యాప్రమాణాలను పెంచేందుకు 75 శాతం హాజరు దినాల ప్రాతిపదికన అమ్మ ఒడి పథకాన్ని అమలు చేస్తున్నట్లు అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. 2022 జూన్ 27న, 2023 జూన్ 28న నిధులను విడుదల చేశారు. ఈ ఏడాది కూడా జూన్ చివరి వారంలో నిధులు జమ చేయాల్సి ఉంది. ప్రభుత్వం మారడంతో పథకం అమలుపై నీలినీడలు కమ్ముకున్నాయి.

జిల్లాలో వేలాది మంది ఎదురుచూపు

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 1,600, ప్రైవేట్ పాఠశాలలు 236 వరకు ఉండగా.. ఇక్కడ సుమారు 1,80,000 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు. జిల్లాలో అమ్మఒడి పథకం కింద వేలాది మంది లబ్ధిదారులు రూ.493.28 కోట్ల మేర లబ్ధి పొందారు. ప్రస్తుత ప్రభుత్వం హామీ మేరకు జిల్లాలో లబ్ధిదారుల సంఖ్య మరింత పెరగనుంది. 1.50 లక్షల మందికిపైగా పథకం వర్తించాల్సి ఉంది. ఇప్పటి వరకు దీనికి సంబంధించిన విధివిధానాలు ఇంకా జిల్లా విద్యాశాఖాధికారులకు రాలేదు. గత ప్రభుత్వం మాదిరి ప్రైవేట్, ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులందరికీ వర్తింపజేస్తుందా.. లేకుంటే ప్రభుత్వ బడులకే పరిమితం చేస్తుందా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

ఇంకెప్పుడిస్తారు?

ఎన్నికల మేనిఫెస్టోలో కూటమి ప్రభుత్వం అమ్మకు వందనం పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలు బడికి వెళ్తే అందరికీ రూ.15 వేలు చొప్పున అందిస్తామని ప్రకటించింది. ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు సమీపిస్తోంది. విద్యాసంవత్సరం ప్రారంభమై మూడు వారాలు గడుస్తున్నాయి. ఇప్పటికే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. అప్పోసప్పో చేసి ఫీజులు చెల్లించారు. పుస్తకాలు, యూనిఫారాలు కొనుగోలు చేశారు. అమ్మకు వందనం పేరుతో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం మాత్రం పత్తా లేకుండా పోయింది. ప్రభుత్వం ఏర్పడ్డాక కేబినెట్ భేటీలు జరిగినా.. ఈ పథకంపై చర్చించిన దాఖలాలు లేవు. దీంతో తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి డిమాండ్



జేసీ శోభికకు వినతిపత్రాన్ని అందజేస్తున్న రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కృష్ణమూర్తి, లక్ష్మీనాయుడు, తదితరులు

పార్వతీపురం: జిల్లాలో రైతులు ఎదుర్కొంటున్న వ్యవసాయ సంబంధిత సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కృష్ణమూర్తి, రెడ్డి లక్ష్మీనాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు జాయింట్ కలెక్టర్ శోభికను ఆమె కార్యాలయంలో కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాను పారిశ్రామికంగా, వ్యవసాయపరంగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల మిగులు పనులు పూర్తిచేసి సాగునీటి కష్టాలు తీర్చాలన్నారు. దీర్ఘకాలంగా పార్వతీపురం, సీతానగరం, గరుగుబిల్లి మండలాల రైతులు ఎదురుచూస్తున్న జంఝావతి ప్రాజెక్టు సమస్యను పరిష్కరించి సత్వరమే పూర్తిచేయాలన్నారు. పార్వతీపురం మండలంలో అడారు రిజర్వాయర్‌ను పూర్తిచేయడంతో పాటు గుమ్మడిగెడ్డపై రిజర్వాయర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. వెంగళరాయ రిజర్వాయర్ అదనపు ఆయకట్టు కాలువల పనులు పూర్తిచేసి సాగునీరు అందించాలని కోరారు. పెద్దగెడ్డకు ఎడమ కాలువ నిర్మించి లిఫ్ట్ ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. తోటపల్లి ప్రాజెక్టు ఎడమ కాలువ సిమెంట్ లైనింగ్ పనులు సత్వరమే పూర్తి చేయాలని, కంచరగెడ్డ, కనుమలగెడ్డ, నువ్వులుగెడ్డ, పాలగెడ్డ, కేదారిపురంగెడ్డ, తాడికొండగెడ్డలపై మినీ రిజర్వాయర్లు నిర్మిస్తే బంజరు భూములు సాగులోకి వస్తాయని, రైతులకు మేలు జరుగుతుందన్నారు. వెంగళరాయ సాగర్, పెద్దగెడ్డ, తోటపల్లి కాలువల సిమెంట్ లైనింగ్ పనులు పూర్తి చేయాలని, తోటపల్లి, పెద్దగెడ్డ ప్రాజెక్టుల నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని కోరారు.

లచ్చయ్యపేట సుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పునఃప్రారంభించాలన్నారు. జిల్లాలోని ఏకైక జూట్ మిల్లును తెరిపించాలని, రైతులు పండించే టమాటో, చింతపండు, కూరగాయలు నిల్వ చేసుకునేందుకు కోల్డ్ స్టోరేజీలు నిర్మించాలని కోరారు. మొక్కజొన్న, పత్తి, అపరాలు, జీడి పంటల విక్రయాలకు వీలుగా సాలూరు, పార్వతీపురం, పాలకొండ, కురుపాంలలో మార్కెట్లను ఏర్పాటు చేయాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు భూమి యజమానితో సంబంధం లేకుండా జారీ చేయాలని, పంటలకు ప్రభుత్వం ప్రకటించిన స్కేల్ ఆఫ్ ఫైనాన్స్‌తో బ్యాంకు రుణాలు ఇవ్వాలని విన్నవించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని జేసీ తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు బంటు దాసు, నాయకులు బి.అప్పారావు, బోను గౌరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిందితులు



పోలీసులు అదుపులో నిందితులు, ఆభరణాలు

నెల్లిమర్ల: ఇటీవల నెల్లిమర్లలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ వెంకటేశ్వరరావు దొంగ తనానికి సంబంధించిన వివరాలను గురువారం వెల్లండిచారు. నెల్లిమర్ల జూట్‌మిల్లు కార్మికుడు రంజిత్ అక్కడే ఉన్న క్వార్టర్స్‌లో 30 ఏళ్లుగా నివాసిస్తున్నాడు. అతని ఇంటిలో ఇటీవల దొంగతనం జరిగింది. సుమారు రెండున్నర తులాలు బంగారం, 16 తులాలు వెండి ఆభరణాలు చోరీకి గురయ్యాయి. రంజిత్ నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు 24 గంటల్లో కేసును చేధించి నగర పంచాయతీకి చెందిన ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఆభరణాలను రికవరీ చేశారు. వాటిని త్వరలోనే బాధితునికి అప్పగిస్తామని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ డి.రామగణేష్, తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజు వ్యక్తి కాదు సమూహ శక్తి

- సంయుక్త కలెక్టర్ శోభిక



కలెక్టరేట్‌లో అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ శోభిక, తదితరులు

పార్వతీపురం: అల్లూరి సీతారామరాజు అంటే వ్యక్తి కాదు సమూహ శక్తి అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్.శోభిక అన్నారు. అల్లూరి 127వ జయంతి వేడుకలు కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు 1897 జూలై 4న విశాఖపట్నం జిల్లా పాండ్రంగి గ్రామంలో జన్మించారన్నారు. ఆయన ఓ విప్లవ యోధుడని, సంగ్రామ భేరి, స్వాతంత్ర్య నినాదం, సమరగీతం, ఉద్యమ జ్వాల అని పేర్కొన్నారు. అల్లూరి జరిపిన సాయుధ పోరాటం స్వాతంత్ర్య ఉద్యమంలో ఒక ప్రత్యేక అధ్యాయమని, సాయుధ పోరాటం ద్వారానే స్వాతంత్ర్యం వస్తుందని నమ్మి, దాని కొరకే తన ప్రాణాలర్పించిన యోధుడని ఆమె కొనియాడారు. కేవలం 27 ఏళ్ల వయసులోనే నిరక్షరాస్యులు, నిరుపేదలు, అమాయకులు అయిన అనుచరులతో, చాలా పరిమిత వనరులతో బ్రిటీష్ సామ్రాజ్యమనే మహాశక్తిని ఢీకొన్నాడన్నారు. మన్యం వీరుడు, తెలుగు జాతి యుగపురుషుడు అల్లూరి అని పేర్కొన్నారు. మన్యం వీరుడుగా నాయకత్వం వహించి బ్రిటిష్ బలగాలకు ముల్లులా మారారన్నారు. సీతారామరాజు ధైర్యసాహసాలు, ప్రాణత్యాగం ఎందరో భారతీయులను ఉత్తేజపరచి, వారిలో జాతీయతా భావాన్ని, దేశభక్తినీ పురిగొల్పాయన్నారు. సన్యాసి జీవితం గడిపిన అల్లూరి తన స్వీయముక్తి కంటే, అణగారిన ప్రజల సాంఘిక, ఆర్థిక విముక్తికి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, కలెక్టరేట్ పరిపాలన అధికారి వేణుగోపాలరావు, జిల్లా పంచాయతీ అధికారి బి.సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్నివీర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

పార్వతీపురంటౌన్: అగ్నివీర్ పథకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు జిల్లా ఉపాధి అధికారి వహిద గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇండియన్ ఎయిర్ ఫోర్సులో పనిచేసేందుకు ఎస్ఎస్‌సీ/ ఇంటర్మీడియట్ (మాథ్స్/ ఫిజిక్/ కెమిస్ట్రీ)లో 50శాతం మార్కులు కలిగిన యువతీ యువకులు ఈ నెల 8 నుంచి 28వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వెబ్ పోర్టల్ హెచ్‌టీటీపీఎస్://అగ్ని పథ్.సీడీఏసీ.ఇన్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

అక్రమ కట్టడాల తొలగింపునకు ఆదేశం



సర్వేనంబర్ 142–1లోని భూముల్లో ఆక్రమణలను పరిశీలిస్తున్న ఆర్డీఓ సూర్యకళ

కొత్తవలస: విజయనగరం–కొత్తవలస రోడ్డును ఆనుకొని సర్వే నంబర్ 142–1లో ఉన్న గెడ్డపోరంబోకు భూముల్లో అక్రమ కట్టడాలను తొలగించాలని రెవెన్యూ అధికారులను విజయనగరం ఆర్డీఓ సూర్యకళ ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత భూములను ఆమె గురువారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఎవరు ఎంత భూమి ఆక్రమించారన్న విషయాన్ని డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ భూముల్లో సుమారు 24 మంది ఆక్రమణదారులు ఉన్నట్లు గుర్తించామని, ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు ఫారం–6,7 నోటీసులు జారీచేసినట్టు అధికారులు తెలిపారు. ఆక్రమిత భూముల్లో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఇల్లు కట్టారని తెలపగా ఆర్డీఓ మండిపడ్డారు. భూ ఆక్రమణకు పాల్పడిన ఉద్యోగులపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. అనంతరం చింతలదిమ్మ దగ్గర గల ఎంఎల్‌ఓ గొడౌన్‌ను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ టి.రమేష్, సర్వేయర్ గంగాధర్, ఆర్ఐ రాజేష్, వీఆర్వో రామానందం పాల్గొన్నారు.

పార్వతీపురంలో బంద్ విజయవంతం



బంద్‌లో పాల్గొన్న, విద్యార్థి సంఘాలు, విద్యార్థులు

పార్వతీపురంటౌన్: విద్యార్థి సంఘాలు గురువారం తలపెట్టిన దేశ వ్యాప్త విద్యాసంస్థల బంద్ పార్వతీపురం జిల్లాలో విజయవంతమైంది. ఈ నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు నిరసన ర్యాలీ చేపట్టారు. నీట్ పరీక్షలను రద్దు చేయాలని, లీకేజీకి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తెరిచి ఉన్న పాఠశాలలకు వెళ్లి విద్యార్థులను బయటకు పంపించారు.

కార్యక్రమంలో పీడీఎస్‌ఓ జిల్లా కన్వీనర్ కె.సోమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అఖిల్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ మరింత ఆలస్యం!

- మరోసారి టెట్ నిర్వహణకు దరఖాస్తుల స్వీకరణ
- పరీక్షకు మూడునెలలు వ్యవధి ఇచ్చే అవకాశం
- ఈ లెక్కన డీఎస్సీ నోటిఫికేషన్ జాప్యమయ్యే సూచన
- 2025 విద్యాసంవత్సరానికి పోస్టుల భర్తీ!
- జిల్లాలో ఎన్ని పోస్టులు భర్తీచేస్తారన్నదానిపై స్పష్టత కరువు



డీస్సీ రాయనున్న డీఎడ్ అభ్యర్థులు

విజయనగరం అర్బన్: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు తీసుకున్న తరువాత తొలిసంతకం ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నిర్వహించే డీఎస్సీ ఫైల్‌పై పెట్టారు. దీంతో వెంటనే నోటిఫికేషన్ వస్తుందని ఉద్యోగులు ఆశపడ్డారు. కూటమి ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయలేదు. సుమారు 20 రోజుల తర్వాత టెట్ నోటిఫికేషన్ ఇస్తామని ప్రకటించింది. ఈ నెల 2న నోటిఫికేషన్ విడుదల చేసింది. 4వ తేదీ నుంచి 17వ తేదీవరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు గడువు ఇచ్చింది. టెట్ పరీక్షను ఆగస్టు 5 నుంచి 20వ తేదీవరకు రెండు విడతల్లో నిర్వహిస్తామని ప్రకటించినా... అభ్యర్థుల వినతి మేరకు నోటిఫికేషన్‌కు పరీక్షకు మధ్య 90 రోజులు గడువు ఉండేలా చూస్తామని విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ ప్రకటించారు. ఈ మేరకు కొత్త షెడ్యూల్ విడుదల చేస్తామని పేర్కొన్నారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు కూడా ఇదే పద్ధతి అమలుచేయనున్నారు. ఈ లెక్కన డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలలో జాప్యం జరుగుతుందని విద్యావేత్తలు చెబుతున్నారు. 2025 విద్యాసంవత్సరం ఆరంభం నాటికి ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలన్నదే ప్రభుత్వ ఆలోచనగా కనిపిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ నిర్ణయం ఇప్పటికే పరీక్షకు సిద్ధమైన వారికి విసుగుతెప్పిస్తుండగా, కొత్తగా పరీక్షకు హాజరయ్యే వారికి కలిసివచ్చేలా ఉంది.

గడిచిన రెండేళ్లలో గత ప్రభుత్వం నిర్వహించిన టెట్‌కు హాజరైన అభ్యర్థులు ఇలా...		
సంవత్సరం	దరఖాస్తుదారులు	పరీక్ష రాసినవారు
2022	17,420	16,082
2024	11,590	10,439

టెట్‌కు వెయిటేజీ..

ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన ఏపీ టెట్–24 పరీక్షకు ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన 11,590 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. అంతకు ముందు 2022లో నిర్వహించిన ఏపీ టెట్ పరీక్షలో మాత్రం 17,420 మంది పరీక్ష రాశారు. అంటే గత రెండు టెట్ పరీక్షలను పరిశీలిస్తే దాదాపు 6 వేల మంది అభ్యర్థుల పోటీ తగ్గినట్లు గణాంకాలు చెబుతున్నాయి. టెట్‌లో వచ్చే మార్కుల వెయిటేజీ ఉండడంతో కొందరు అభ్యర్థులు ఒక్క మార్కు అయినా కలుస్తుందనే ఆశతో ప్రతి సారీ పోటీపడతారు.

583 పోస్టుల ఖాళీలపై స్పష్టత కరువు

ప్రభుత్వం ప్రకటించిన టీచర్ పోస్టుల ఖాళీలపై జిల్లా విద్యాశాఖ వద్ద స్పష్టత లేదు. రాష్ట్రస్థాయిలో ప్రకటించిన 16 వేల పోస్టుల్లో జిల్లా నుంచి 583 పోస్టులు ఖాళీలున్నట్టు తెలిపింది. అయితే, ఇటీవల రద్దయిన డీఎస్సీ నోటిఫికేషన్ ప్రకారం జిల్లాలో అన్ని యాజమాన్యాలు కలుపుకొని కేవలం 284 పోస్టులు మాత్రమే ఉన్నాయి. గురుకులాల్లోని ఖాళీలను ప్రస్తుత నోటిఫికేషన్‌కు కలపడంతో ఆయా విద్యాలయాల్లో దశాబ్దాలుగా పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. వారికి న్యాయం చేస్తామని గిరిజన సంక్షేమ శాఖ మంత్రితో పాటు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ఉపాధ్యాయ ఖాళీల అసలు లెక్క తేలాల్సి ఉంది.

క్లుప్తంగా

జీఎంఆర్ ఐటీ వేదికగా అంతర్జాతీయ సదస్సు

• నేటి నుంచి రెండు రోజుల పాటు నిర్వహణ

రాజాం సిటీ: రెండు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సుకు రాజాం పట్టణంలోని జీఎంఆర్ ఐటీ కళాశాల వేదిక కానుంది. ఈ నెల 5న 'ఏఐ–పవర్డ్ టెక్నాలజీ ఇంటిగ్రేషన్ ఫర్ సస్టైనబిలిటీ' (ఏఐ–పీటీఐఎస్–2024)ని కళాశాలలో ప్రారంభించనున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ సీఎల్‌వీఆర్‌ఎస్‌వీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైబ్రీడ్ (ఆన్‌లైన్, ఆఫ్‌లైన్) విధానంలో రెండు రోజులపాటు నిర్వహించనున్న ఈ సదస్సులో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలను సాధించడంలో కృత్రిమ మేధస్సు (ఏఐ), మానవాళి మనుగడకు దోహదపడే అంశాలను చర్చించడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఏఎస్‌టీఐఎఫ్ ప్రెసిడెంట్, ఛత్తీస్‌గఢ్‌లోని అమిటీ యూనివర్సిటీ చాన్సలర్ డాక్టర్ డబ్ల్యూ.సెల్వమూర్తి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని తెలిపారు. అలాగే ఆంధ్రాయూనివర్సిటీ కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ డాక్టర్ వి.వల్లికుమారి గౌరవ అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్ అప్లికేషన్స్, రెన్యువబుల్ ఎనర్జీ, సైన్స్, ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ అనే అంశాలపై పరిశోధకులు చర్చిస్తారన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన వారు 135 పరిశోధన పత్రాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కన్వీనర్లుగా డాక్టర్ కె.జయశ్రీ, డాక్టర్ కె.రవీంద్రనాథ్‌లు వ్యవహరించనున్నారని వివరించారు.

మహిళల మెడలో బంగారం చోరీ

జియ్యమ్మవలస: మండలంలోని పరజపాడు గ్రామానికి చెందిన బోను గంగ,నక్క పోలమ్మల మెడలోని బంగారు అభరణాలు చోరీకి గురైనట్లు ఎస్సై చిన్నంనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై చిన్నంనాయుడు మాట్లాడుతూ గెడ్డతిరువాడలో సీమంతం కార్యక్రమానికి బుధవారం రాత్రి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో వారిద్దరి మెడలో పుస్తెల తాళ్లు దుండగుడు తెంపుకుని పోయాడని చెప్పారు. పిప్పలభద్ర, గెడ్డతిరువాడ గ్రామాల మధ్య పల్సర్‌బైక్‌పై గుర్తుతెలియని వ్యక్తి వచ్చి గంగమెడలో ఉన్న నల్లపూసలతాడు తెంపగా అందులో కొంతభాగం ఉండిపోయి ముప్పావు తులం వరకు పోయిందని, అలాగే పోలమ్మ మెడలో ఉన్న బంగారం తాడు సగభాగం తెంచి దుండగుడు పోయాడని తెలిపారు.వారిద్దరి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



ఇసుక ట్రాక్టర్‌లను సీజ్ చేస్తున్న ఎస్సై యు.మహేష్

గజపతినగరం: మండలంలోని లోగీశ, సీతారామపురం గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తూ పట్టుబడిన మూడు ట్రాక్టర్‌లను సీజ్ చేశామని ఎస్సై యు.మహేష్ తెలిపారు. ఈ మేరకు గురువారం రాత్రి ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రాక్టర్‌లను సీజ్ చేస్తూ విలేకరులతో మాట్లాడారు.అక్రమ ఇసుక వ్యాపారాలు సాగిస్తున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టామని, తప్పు చేసిన ఎంతటి వారినైనా వదిలి పెట్టేది లేదని స్పష్టం చేశారు.

అర్హులైన కౌలు రైతులకు గుర్తింపు కార్డులు



కౌలు రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ సహాయ సంచాలకుడు కోటేశ్వరరావు

నెల్లిమర్ల రూరల్: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలను అందజేస్తామని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని సీతారామునిపేట గ్రామంలో రైతులకు కౌలు గుర్తింపు కార్డుల నమోదుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 10వ తేదీ వరకు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. కౌలు గుర్తింపు కార్డుల కాల పరిమితి 11 నెలలు ఉంటుందని, అర్హులైన రైతులు స్థానిక రైతు సేవా కేంద్రాల్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్డుల వల్ల బ్యాంకులో రుణాలు, ప్రభుత్వ రాయితీ విత్తనాలు, పంటల బీమా, నష్ట పరిహారం పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ పూర్ణిమ, ఏఈఓ నాగరాజు, సర్పంచ్ ప్రతినిధి రాంబార్కి రామారావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిరాశలో 'ఆణిముత్యాలు'

- గతేడాది టాపర్లకు రాష్ట్రస్థాయిలో రూ.లక్ష బహుమతి
- జిల్లా, నియోజకవర్గ స్థాయి విజేతలకు ప్రోత్సాహకాలు
- ఈ ఏడాది ఇంతవరకూ విడుదల కాని మార్గదర్శకాలు
- అయోమయంలో విద్యార్థులు, తల్లిదండ్రులు



రామభద్రపురం ఉన్నత పాఠశాలలో పట్టుదలతో చదువుతున్న పదో తరగతి విద్యార్థులు (ఫైల్)



పదోతరగతి పబ్లిక్ పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు(ఫైల్)

రామభద్రపురం: ప్రభుత్వ విద్యారంగాన్ని పటిష్టం చేయడం..ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతులైన విద్యార్థులను గత ప్రభుత్వం ప్రోత్సహించింది. విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు 2022–23 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ఎంపిక చేసి 'ఆణిముత్యాలు' పేరిట నగదు ప్రోత్సాహకాలు అందించింది. పదో విద్యార్థులకు మాత్రమే కాకుండా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రతి గ్రూప్‌లో టాపర్లను ఎంపిక చేసి నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రస్థాయిలో నగదు ప్రోత్సాహకాలు అందించింది. 'ఆణిముత్యాలు'గా ఎంపికైన విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో ఉపాధ్యాయుల్ని, నగదు పురస్కారం అందుకున్న విద్యార్థుల తల్లిండ్రులను కూడా గత ప్రభుత్వం ఘనంగా సత్కరించి గౌరవించింది. అయితే ఈ పథకాన్ని ఏటా అమలు చేయనున్నట్లు అప్పట్లో స్పష్టం చేసింది. దీంతో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు పట్టుదలతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించిన వారు 21,752 మంది ఉన్నారు. వారిలో టాపర్లకు నగదు ప్రోత్సాహకాలు అందుతాయని అంతా భావించారు. అయితే ఈ ఏడాది ఇంత వరకూ 'ఆణిముత్యాలు' పథకం అమలుపై నూతన ప్రభుత్వం ఏ విధమైన మార్గదర్శకాలు జారీ చేయకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరాశతో ఉన్నారు.

టాపర్లకు రూ.లక్ష బహుమతి

ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి, ప్రభుత్వ కళాశాలలో ఇంటర్మీడియట్‌లో వివిధ గ్రూపులు చదివిన విద్యార్థుల్లో ప్రథమ స్థానంలో నిలిచిన రాష్ట్రస్థాయి టాపర్లకు రూ.లక్ష నగదు ప్రోత్సాహకాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్వయంగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.75 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.50 వేలు చొప్పున అందజేశారు.నగదు పురస్కారంతో పాటు సర్టిఫికెట్, మెడల్స్ కూడా ఇచ్చి విద్యార్థులను ప్రోత్సహించారు.

జిల్లా, నియోజకవర్గాల స్థాయిలో కూడా..

నగదు ప్రోత్సాహకాలు కేవలం రాష్ట్రస్థాయికే పరిమితం చేయకుండా నియోజకవర్గం, జిల్లా స్థాయికి వర్తింపజేశారు. జిల్లా స్థాయిలో టాపర్లకు రూ.50 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.30 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.15 వేలు చొప్పున అందించారు. అలాగే నియోజకవర్గం స్థాయి టాపర్లకు రూ.15 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.10 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.5 వేలు చొప్పున అందజేశారు. ఈ రెండు స్థాయిల్లో కూడా ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. స్థానిక దాతల సహకారంతో పాఠశాల స్థాయి టాపర్లకు ప్రథమ స్థానానికి రూ.3 వేలు, ద్వితీయ స్థానానికి రూ.2 వేలు, తృతీయ స్థానానికి రూ.1000 చొప్పున నగదు బహుమతులను అందజేశారు. అయితే విజయనగరం జిల్లాలో జిల్లా, నియోజకవర్గం స్థాయిలో ప్రథమ స్థానంలో 16 మంది, ద్వితీయ స్థానంలో 24 మంది, తృతీయ స్థానంలో 25 మంది, మొత్తం 65 మంది విద్యార్థులకు నగదు పురస్కారం అందగా ఇంటర్మీడియట్‌లో 248 మంది విద్యార్థులకు వివిధ స్థాయిల్లో నగదు బహుమతులు అందాయి.

ఈ ఏడాది సందిగ్ధం..

'ఆణిముత్యాలు' పథకానికి గత ఏడాది తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నుంచి గొప్ప స్పందన లభించింది. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి కార్యక్రమం చేపట్టలేదని, భవిష్యత్‌లో కూడా కొనసాగించాలని కోరారు. గత ఏడాది జూన్ 20 నాటికి అన్ని స్థాయిల్లో నగదు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమాలు పూర్తయ్యాయి. అయితే ఈ ఈ ఏడాది 'ఆణిముత్యాలు' పథకం అమలవుతుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారులకు కూడా మార్గదర్శకాలు అందకపోవడంతో ఈ ఏడాది నగదు ప్రోత్సాహకాలు ఇస్తారా? లేదా? అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది.ఈ పథకం అమలు కాకుంటే దాని ప్రభావం తమ భవిష్యత్ చదువులపై పడవచ్చని, పథకాన్ని కొత్త ప్రభుత్వం కొనసాగించాలని విద్యార్థులు కోరుతున్నారు.

వెలువడని మార్గదర్శకాలు



రాష్ట్ర విద్యాశాఖ ఇప్పటివరకూ ఏ విధమైన మార్గదర్శకాలు విడుదల చేయలేదు. 'ఆణిముత్యాలు' పథకం మంచిదే. ఈ పథకం అమలు ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభావంతుల్ని మరింత ప్రోత్సహించొచ్చు. సర్కారు నుంచి ప్రకటన వెలువడిన వెంటనే టాపర్ల ఎంపిక చేపడతాం.

ఎన్.ప్రేమ్‌కుమార్, డీఈవో, విజయనగరం

మినీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలి

• గిరిజనుల డిమాండ్



మినీ రేషన్ డిపో కావాలని డిమాండ్ చేస్తున్న సర్పంచ్ శంకర రావు, గ్రామస్తులు

సాలూరు రూరల్: మండలంలోని కరడవలస గ్రామంలో మినీ రేషన్ డిపో ఏర్పాటు చేయాలని ఆ పంచాయతీ గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ఇటీవల గిరిజన శాఖామంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఏజెన్సీలో డిపోలద్వారా రేషన్ సరుకులు పంపిణీచేస్తామని ప్రకటించడంతో తాము డిపోలో సరుకులు తీసుకోడానికి దండిగాం వెళ్లాల్సి ఉంటుందని అలా కాకుండా కరడవలసలో మినీ రేషన్ డిపో ఏర్పాటు చేస్తే సుమారు 15 గ్రామాల గిరిజనులకు సరుకులు తీసుకునేందుకు దగ్గరగా ఉంటుందన్నారు. గతంలో కరడవలస గ్రామానికి రోడ్డు సదుపాయం ఉండేది కాదని వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్న దొర చొరవతో కరడవలసకు బీటీరోడ్డు నిర్మాణం జరిగిందని చెప్పారు. ఇప్పుడు గ్రామానికి వాహనాల రాకపోకలు నిరంతరం జరుగుతున్నాయని, మినీ రేషన్ డిపో మంజూరు చేయకపోతే ఇప్పటివరకు సరుకులు పంపిణీ చేసిన విధానంలోనే తమ గ్రామానికి మొబైల్ రేషన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

381 మద్యం సీసాలు ధ్వంసం



మద్యం సీసాలను ధ్వంసం చేస్తున్న ఎస్సై భాస్కరరావు, సిబ్బంది

గుర్ల: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నమోదైన 24 కేసుల్లో పట్టుబడిన 381 మద్యం సీసాలు, 20లీటర్ల సారాను గురువారం ధ్వంసం చేసినట్లు ఎస్సై భాస్కరరావు తెలిపారు. ఎస్పీ ఆదేశానుసారం ఎస్‌ఈబీ అధికారుల సమక్షంలో మద్యం సీసాలు ధ్వంసం చేశామని చెప్పారు. గ్రామాల్లో బెల్ట్ షాపు ద్వారా మద్యం అమ్మకాలు జరిపితే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఎన్‌ఓ, ఏపీఓ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



డీఈఓ పగడాలమ్మ

పార్వతీపురంటౌన్: డీఈఓ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఏఎస్‌ఓ, ఏపీఓ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ పగడాలమ్మ కోరారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. ఏఎస్‌ఓ–1, ఏపీఓ–2 మొత్తం మూడు పోస్టులకు ఈ నెల 5న సాయంత్రం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పార్వతీపురం మ్యం జిల్లాలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు మాత్రమే ఈ పోస్టులకు అర్హులని స్పష్టం చేశారు. అభ్యర్థులను కలెక్టరేట్‌లో కంప్యూటర్ టెస్ట్ ద్వారా ఎంపిక చేస్తారని తెలిపారు.

నూతన కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్‌కు అభినందనలు తెలుపుతున్న ఫోరం ఫర్ బెటర్ విజయనగరం ప్రతినిధులు

విజయనగరం టౌన్: ఫోరం ఫర్ బెటర్ విజయనగరం తరపున పట్టణంలో ఉన్న వివిధ స్వచ్ఛంద సంస్థల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు నూతన కలెక్టర్ డాక్టర్ బీఆర్.అంబేడ్కర్‌ను గురువారం ఆయన చాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ వెంకటేశ్వరరావు, కాపుగంటి ప్రకాశ్‌లు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. వివిధ సంస్థల ప్రతినిధులు ఫోరం తరపున కలెక్టర్‌ను దుశ్శాలువాలతో సత్కరించారు. పట్టణ అభివృద్ధికి ఫోరం సభ్యుల సహకారం ఎప్పుడూ ఉంటుందని ఫోరం అధ్యక్షుడు డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. త్వరలోనే ఫోరం సభ్యులతో సమావేశం నిర్వహించి తగు సూచనలు, సలహాలు స్వీకరిస్తామని కలెక్టర్ వారికి తెలిపారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు డాక్టర్ పద్మకుమారి, నాగేశ్వరరావు, శంకర్‌రెడ్డి, రవ్వాశ్రీనివాస్, లిఫ్టింగ్ హ్యాండ్స్ ప్రతినిధి ఎస్.అచ్చిరెడ్డి, జీహెచ్‌వీ ప్రతినిధి, ఫోరం కోశాధికారి భోగరాజు సూర్యలక్ష్మి, కాపుగంటి రవి, ఇన్నర్‌వీల్ రాధిక, ఇందు తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకిన మహిళ సురక్షితం

• రక్షించిన పోలీసులు



బావిలో దూకిన మహిళను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

వీరఘట్టం: మండలంలోని చలివేంద్రి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని మహిళ లావణ్య(35) బుధవారం అర్ధరాత్రి బావిలో దూకడంతో ఆమెను పోలీసులు చాకచక్యంగా రక్షించారు. ఈ మేరకు ఎస్సై కళాధర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొన్నేళ్లుగా మానసిక పరిస్థితి బాగోలేక అవస్థలు పడుతున్న లావణ్యను కుటుంబసభ్యులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. అయితే బుధవారం రాత్రి వారింటి సమీపంలో ఉన్న బావిలో లావణ్య దూకింది. ఈ విషయం తెలిసిన వెంటనే ఎస్సై కళాధర్‌తో పాటు పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావు తమ సిబ్బందితో వచ్చి పరిస్థితిని పరిశీలించారు. బావిలోకి నిచ్చెన ద్వారా అగ్నిమాపక సిబ్బంది దిగి మహిళను బయటకు సురక్షితంగా తీసుకువచ్చి కుటుంబసభ్యులకు అప్పగించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

విజయనగరం విక్టరీ

• క్రికెట్ టోర్నీలో ప్రకాశం జట్టుపై 138 పరుగులతో గెలుపు



విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టు

విజయనగరం: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరం జిల్లా కేంద్రంలోని విజ్జీ క్రికెట్ మైదానంలో ఈనెల 2 నుంచి నిర్వహిస్తున్న అంతర్ జిల్లాల అండర్–16 క్రికెట్ టోర్నీలో విజయనగరం జిల్లా జట్టు ప్రకాశం జిల్లా జట్టుపై 138 పరుగుల తేడాతో విజయం సాధించి బోణీ కొట్టింది. టెస్ట్ మ్యాచ్ తరహాలో మూడు రోజుల ఫార్మాట్‌లో జరుగుతున్న టోర్నీలో తొలి ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 255 పరుగులు సాధించగా ప్రకాశం జిల్లా జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 161 పరుగులకు ఆలౌట్ అయ్యి 94 పరుగులు వెనుకబడింది. రెండో ఇన్నింగ్స్‌లో విజయనగరం జట్టు 210 పరుగులకు ఆలౌట్ కాగా, ప్రకాశం జట్టు మూడో రోజు గురువారం 166 అడుగులకు ఆలౌట్ అయి 138 పరుగుల తేడాలతో ఓటమి పాలైంది. విజయనగరం జట్టులో తొలి ఇన్నింగ్స్‌లో చరణ్ తేజ 50 పరుగులు, మన్ వటేకర్ 72 పరుగులు సాధించగా, రెండో ఇన్నింగ్స్‌లో జి.ఫణీంద్ర 50 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. ప్రకాశం జట్టులో ఎస్ఎస్ అభినవ్ తొలి ఇనింగ్స్‌లో 50 పరుగులు చేయగా రెండో ఇన్నింగ్స్‌లో వైభవ్ రెడ్డి 54 పరుగులు సాధించినప్పటికీ జట్టును ఓటమి నుంచి కాపాడలేకపోయారు. విజయం సాధించిన విజయనగరం జిల్లా జట్టును, కోచ్ బహదూర్‌ను జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎంఎల్ ఎన్ రాజు, ట్రెజరర్ పి.సీతారామరాజు, సెలెక్టర్లు వర్మ, సర్వరాజ్, బంగార్రాజులు అభినందించారు

ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలి



మాట్లాడుతున్న ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ

• ఆపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీసత్యనారాయణ

విజయనగరం అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత ప్రభుత్వ పాఠశాలల మనుగడను ప్రశ్నార్థకంగా మార్చిన జీఓ నంబర్ 117ను రద్దు చేసి 3, 4, 5 తరగతుల విద్యార్థులను వారి అభ్యసన స్థాయికి అనుగుణంగా ప్రాథమిక పాఠశాలల్లోనే కొనసాగించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన స్థానిక సేవాభారతి కార్యాలయంలో జరిగిన జిల్లా కోర్ కమిటీ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక, ఉన్నత స్థాయిలలో సిలబస్‌ను సమీక్షించి, విద్యార్థుల స్థాయికి మించిన పాఠ్యాంశాలను తొలగించి విద్యార్థులపై సిలబస్ భారాన్ని, ఒత్తిడిని తగ్గించాలని పేర్కొన్నారు. ప్రతి పాఠశాలలో ఆంగ్లమాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమాన్ని కూడా సమాంతరంగా కొనసాగించాలన్నారు. తల్లికి వందనం ప్రోత్సాహకాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మాత్రమే అమలు చేయాలని కోరారు. ఉపాధ్యాయులకు గరిష్టంగా 30 పీరియడ్లకు మించి కేటాయించడం సమంజసం కాదని, దానికి అనుగుణంగా ఉపాధ్యాయ పోస్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.శ్రీనివాసరావు, వీవీజే సుబ్రహ్మణ్యం, రాష్ట్ర కార్యదర్శి ఈ.రామునాయుడు, రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఎస్.రమణ, కోశాధికారి ఏజీ తాతారావు, ఉపాధ్యక్షులు, కార్యదర్శులు మారోతు రమణ, ఆర్‌అప్పలనాయుడు, సంతోషలక్ష్మి, పద్మలత, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్‌షాక్‌తో పారిశుద్ధ్య కార్మికుడి మృతి



బంగారుబాబు మృతదేహం


డెంకాడ: మండలంలోని సింగవరం పంచాయతీ పరిధి లెంకపేట సమీపంలోని మోటార్ బోరు వద్ద పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న దత్తి బంగారుబాబు విద్యుత్ షాక్‌కు గురై మరణించాడు. పోలీసులు, మృతుడి బంధువులు తెలిపిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గురువారం ఉదయం 6 గంటల ప్రాంతంలో సింగవరం పంచాయతీలోని (జువ్వపాడు) ప్రభుత్వ పాఠశాల పక్కన ఉన్న తాగునీటి మోటార్ బోరు వద్ద కొడవలితో గడ్డి కోస్తుండగా కొడవలికి బోరు విద్యుత్ వైర్లు తగలడంతో బంగారుబాబు షాక్‌కు గురై అక్కడికక్కడే మరణించాడు. ఈ ఘటనపై మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.కృష్ణమూర్తి కేస నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. 2018 నుంచి సింగవరం పంచాయతీలో పారిశుద్ధ్య కార్మికుడిగా దత్తి బంగారుబాబు విధులు నిర్వర్తిస్తున్నాడు. ఎప్పటిలాగే ఇంటి నుంచి వెళ్లి బంగారుబాబు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబసభ్యులు భోరున విలపించారు.

ఒప్పంద అధ్యాపకుడు..

కొమరాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒప్పంద అధ్యాపకుడిగా పని చేస్తున్న ఎం.సత్యనారాయణ గురువారం మృతి చెందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వై.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన చెప్పిన వివరాల ప్రకారం గత ఏడాది ఆగస్టు 8 తేదీన మోటార్‌సైకిల్‌పై వెళ్తుండగా జరిగిన ప్రమాదంలో తలకు బలమైన గాయం కావడంతో సత్యనారాయణ కోమాలోకి వెళ్లిపోయారు. అప్పటి నుంచి వైద్యం అందించినప్పటికీ కోలుకోలేదు. ఆయన మృతి పట్ల కళాశాల సిబ్బంది సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెరగాలి

• డీవీఈఓ భీమశంకరరావు



మాట్లాడుతున్న డీవీఈఓ భీమశంకరరావు

విజయనగరం అర్బన్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సులలో ప్రవేశాలను పెంచి విద్యార్థుల నమోదు సంఖ్యను పెంచాలని జిల్లా వృత్తి విద్యాశాఖ అధికారి ఎస్.భీమశంకరరావు కోరారు. ఈ మేరకు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో డీవీఈఓ కార్యాలయంలో గురువారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళాశాలల్లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం సమీప పరిసరాల్లో పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు తమకు నచ్చిన గ్రూప్‌లో చేరవచ్చని ఆదిశగా ప్రచారం చేయాలని సూచించారు. వార్షిక పరీక్షల్లో మంచి ఫలితాలను సాధించడానికి అధ్యాపకులతో సమన్వయంగా పనిచేయించాలని కోరారు. ఇంటర్మీడియట్ కోర్సుల సాధారణ సిలబస్‌లతో పాటు ఎంసెట్, నీట్ తరగతులను కూడా నిర్వహించాలని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమయపాలన పాటించని అధ్యాపకులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆర్‌ఐఓ మజ్జి ఆదినారాయణ, జిల్లాలోని జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

క్రీడాభివృద్ధికి కృషి చేస్తాం



వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులతో ఎమ్మెల్యే అదితిగజపతిరాజు

విజయనగరం: క్రీడాభివృద్ధికి కృషిచేస్తానని విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితిగజపతిరాజు అన్నారు. జిల్లా కేంద్రంలో మూతపడిన క్రీడా పాఠశాలతో పాటు ఖోఖో, కబడ్డీ అకాడమీలను తెరిపించడంలో సాధ్యాఅసాధ్యాలపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. రాజీవ్ క్రీడామైదానంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ కార్యాలయంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులతో పాటు వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాజీవ్ క్రీడా మైదానం, విజ్జీ స్టేడియం, ఇండోర్ స్టేడియం, ఆక్వా స్విమ్మింగ్ పూల్‌ను క్రీడాకారులందరూ వినియోగించుకునేలా, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తీర్చిదిద్దుతామన్నారు. పోలీసుల సాయంతో క్రీడా ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెడతామన్నారు. వివిధ క్రీడాంశాల్లో ప్రతిభ చూపిన వారిని ఆమె అభినందించారు. కార్యక్రమంలో జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్. వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹135	₹240	₹250